సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

దివ్యాంగులు బడిబాట పట్టేలా..

- ప్రత్యేక అవసరాల పిల్లల కోసం సర్వే
- ఇప్పటి వరకు 17 మంది చిన్నారుల గుర్తింపు


భవిత కేంద్రం

పెదగంట్యాడ: దివ్యాంగులను బడిబాట పట్టించే దిశగా ప్రత్యేక చర్యలు ప్రారంభమయ్యాయి. చదువుకు దూరమైన ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాలల్లో చేరని వారితో పాటు మధ్యలో విద్యకు దూరమైన వారి వివరాలను సైతం సేకరిస్తున్నారు. చదువు వల్ల కలిగే ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న రాయితీలను గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఈ సర్వేలో భాగంగా ఇప్పటికే మండలంలో 17 మందిని గుర్తించారు. వారంతా బడికి వచ్చేందుకు ముందుకు వచ్చారని భవిత కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు.


ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఐఈఆర్పీ సూర్యనారాయణ

ఇంటింటి సర్వే

సామాన్య విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను కూడా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అనేక కార్యక్రమాలు చేపడుతోంది. వీటిపై అవగాహన లేకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు వీటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. వారికి సహిత విద్యను అందించే కేంద్రాలున్నాయని తెలియకపోవడంతో చదువుకు దూరమై, ఇళ్లకే పరి మితమై ఉండిపోతున్నారు. ఇప్పుడు ఇలాంటి వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నారు. ఈ నెల 1న ఈ సర్వే ప్రారంభమైంది. ప్రస్తుత వేసవి సెలవుల సమయాన్ని దీని నిమిత్తం వినియోగిస్తున్నారు. పాఠశాలలు తెరిచే నాటికి గుర్తించిన వారందరినీ బడుల్లో చేర్పించేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేశారు.

ఎన్నో ప్రయోజనాలు

ప్రత్యేక అవసరాల గల పిల్లలను బడుల్లో చేర్పించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని అధికారులు తెలియజేస్తున్నారు.

- చదువుకునే దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు ఉచితంగా మంజూరు చేస్తున్నారు.
- నెలకు రూ.300 చొప్పున రవాణా చార్జీలు చెల్లిస్తున్నారు.
- వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా ట్యాబ్‌లు అందజేస్తారు.
- వైకల్య శాతం అధికంగా ఉన్న వారికి సదరం ధ్రువ పత్రాలతో పింఛన్ లభించేలా చూస్తారు.
- బస్సులు, రైళ్లలో ప్రయాణం చేయడానికి పాస్ సదుపాయం కల్పిస్తారు.
- పాఠశాలలకు రాలేని వారి ఇళ్లకు ఉపాధ్యాయులే వచ్చి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలాంటి వారికి పాఠశాలకు వచ్చినట్లే హాజరు నమోదు చేస్తారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్నాం..



మండలంలో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ఐఈఆర్పీలు సూర్యనారాయణ, జయభారతి ప్రత్యేకంగా ఇంటింటి సర్వేలో నిమగ్నమై ఉన్నారు. ఇప్పటి వరకు మండలంలో 17 మందిని గుర్తించాం. వారంతా బడికి వచ్చే అవకాశాలు ఉన్నా రావడం లేదు. అలాంటి బాలల తల్లిదండ్రులను చైతన్యవంతులను చేస్తున్నాం. చిన్నారులను భవిత కేంద్రానికి రప్పించి విద్యాబుద్ధులు నేర్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం కోసం కృషి చేస్తున్నాం.

– బి.శ్రీనివాసరావు, జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్

ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదు



ప్రత్యేక అవసరాల పిల్లలు ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదు. పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి. వచ్చే నెల 8 వరకు భవిత కేంద్రంలో ప్రత్యేక ఉపాధ్యాయునితో ఇంటింటి సర్వే నిర్వహిస్తాం.

– బి.గీత, జిల్లా సహిత విద్య సమన్వయకర్త

క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్ కొత్త జీఎంకు అభినందనలు


హెచ్‌ఆర్‌డీ నూతన జీఎంను అభినందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్‌డీ విభాగం జనరల్ మేనేజర్ టి.కె.ఎస్.ఆర్ ఠాగూర్‌ను స్టీల్ ప్లాంట్‌కు చెందిన వివిధ సంఘాల నాయకులు సత్కరించారు. నూతన జీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా హెచ్‌ఆర్‌డీ విభాగాధిపతి కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు జీఎంను సత్కరించారు. వారు మాట్లాడుతూ ఠాగూర్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్డుపూడి పరదేశి, డి.సంపూర్ణం, ఎ.రవికుమార్, దరిగి రవి, టి.వెంకటరమణ, బి.సత్తిబాబు, జి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిద్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ గుర్తింపు రద్దు

గాజువాక: 2023–24 విద్యా సంవత్సరం పూర్తయినా పాఠశాల భవనం లీజ్ డీడ్‌ను రెన్యువల్ చేసుకోలేని కారణంగా స్థానిక చినగంట్యాడలోని శ్రీవిద్య ఇంగిష్ మీడియం స్కూల్ ప్రభుత్వ గుర్తింపును రద్దు చేసినట్టు గాజువాక మండల విద్యాశాఖాధికారులు ఎం.సునీత, విశ్వనాథం తెలిపారు. ఈ మేరకు ఈ విషయాన్ని పాఠశాల యాజమాన్యానికి శుక్రవారం తెలియజేసినట్టు వారు పేర్కొన్నారు. ప్రభుత్వ గుర్తింపును రద్దు చేసిన కారణంగా ఆ పాఠశాలలో పిల్లలను ఈ విద్యా సంవత్సరం నుంచి చేర్పించవద్దని తల్లిదండ్రులకు తెలియజేస్తున్నామన్నారు. గుర్తింపు లేని ఏ పాఠశాలలోను పిల్లలను చేర్పించవద్దని సూచించారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ


మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామ అప్పారావు

అగనంపూడి: సత్యసాయి భజన మండలి అగనంపూడి ఆధ్వర్యంలో మరిడిమాంబ ఆలయ కూడలి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు, లక్ష్మీ చంద్రకాంతం దంపతుల ఆర్థిక సహకారంతో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ముందుగా సత్యసాయి బాబాకు పూజలు చేసిన అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యసాయి భజన మండలి కో–ఆర్డినేటర్ బి.వి.సుబ్బారావు మాట్లాడుతూ దాతలు సహకారం అందిస్తే చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విందుల వరహాలు, ఎల్.పోలిపల్లి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల సోదాలు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

గాజువాక: ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని గాజువాక పోలీసులు గురువారం సమస్యాత్మక ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. డీసీపీ మేకా సత్తిబాబు నేతృత్వంలో సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, గాజువాక సీఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో బొజ్జన్నకొండ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి తనిఖీలను నిర్వహించారు. ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు సాగిన ఈ కార్యక్రమంలో సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్టు ఏసీపీ తెలిపారు. వచ్చేనెల 4న ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవరకు సమస్యాత్మక ప్రాంతాల్లో సోదాలు జరుగుతాయని పేర్కొన్నారు. రౌడీషీటర్ల కదలికలపై కూడా నిఘా పెట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606

ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు


బౌద్ధ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


గౌతమ బుద్ధ గ్రంథాలయ నిర్వాహకుడు సుబ్బారావును సత్కరిస్తున్న నాయకులు


ఆవిష్కరించిన బుద్ధుని విగ్రహం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బర్మా కాలనీలో బుద్ధ పూర్ణిమ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బర్మా ఆంధ్ర బౌద్ధ సంఘం చైర్మన్ బోర వేణుగోపాల్ గౌతమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా బౌద్ధ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బుద్ధ వందనం, దమ్మ సందేశం, దమ్మ దీక్ష తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుదర్శన్, సర్వేశ్వరరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం

గాజువాక: మానవాళి ఉన్నతికి బుద్ధుని బోధనలు ఎంతగానో దోహదం చేస్తాయని 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ అన్నారు. గౌతమ బుద్ధుడి జయంతిని స్థానిక చైతన్యనగర్‌లోని గౌతమ బుద్ధ గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ శాంతి, సామరస్యానికి బుద్ధుని బోధనలు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన బోధనలను అనుసరించాలన్నారు. గౌతమ బుద్ధ గ్రంథాలయ నిర్వాహకుడు ఎస్వీ సుబ్బారావును ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహక కమిటీ సభ్యులు జాలాది వెంకటేశ్వరరావు, బాపయ్య, బుచ్చయ్య చౌదరి, వరిష్ట పౌరుల సమాఖ్య ప్రతినిధి రమణరాజు, సీపీఐ నాయకులు కర్రి వెంకటేశ్వరరావు, సలీం, రామారావు, అప్పారి దానయ్య, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


బుద్ధుని విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

బుద్ధుని విగ్రహావిష్కరణ

ఉక్కునగరం: గౌతమ బుద్ధుని బోధనలు స్ఫూర్తిదాయకమని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అన్నారు. బుద్ధ పూర్ణిమ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ బౌద్ధ మిషన్ ఆధ్వర్యంలో ఉక్కునగరం బుద్ధ విహార్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన బుద్ధుని విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బుద్ధుడు తన జీవితాన్ని ఆధ్యాత్మికత, ధ్యానం కోసం అంకితం చేశారన్నారు. స్టీల్ ప్లాంట్ బౌద్ధ మిషన్ అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ కపార్డే, ప్రధాన కార్యదర్శి పరమట సత్యనారాయణ బౌద్ధ మిషన్ కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో బౌద్ధ గురువు బంతేజీ అనలేయ్ ఉండ్రాజు, బీఎస్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు.సుదర్శనం, మిషన్ సభ్యులు కె.వి.రమణ, వెంకట రెడ్డి, చిట్టి దేముడు, ఎల్.వి.రమణ, కొండయ్య, కె.సత్యనారాయణ, మాటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


లెమన్ అండ్ స్పూన్ ఆడుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ: వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం లెమన్ అండ్ స్పూన్ ఆడించారు. అలాగే విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

శేష జీవితం ప్రశాంతంగా గడపాలి


పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నుంచి ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న శివాలయం కమిటీ సభ్యులు మాటూరి తిరుపతిరావు, దుర్గాప్రసాద్‌లను గురువారం సత్కరించారు. ఉక్కు బీసీ గేటు శివాలయ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా మహాశివునికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం కూడా దైవ కార్యక్రమాల్లో పాల్గొంటూ, శేష జీవితం గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాస్, శివరామకృష్ణ, సుధాకర్, నడుపూరు శ్రీనివాస్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

గాజువాక: టెక్ మహీంద్రలో వివిధ ఉద్యోగాల భర్తీకి స్థానిక చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమహాలక్ష్మి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ (ఏపీ ఐటీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్ మేళా ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానుందని పేర్కొన్నారు. బీఎస్సీ, బీకాం, బీబీఏ, ఉత్తీర్ణులైన వారితో పాటు ఆయా డిగ్రీలకు సంబంధించిన ఫైనలియర్ విద్యార్థులు కూడా ఈ జాబ్ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. 32 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులు తమ రెజ్యూమ్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సర్టిఫికెట్‌లతో జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖలోనే పని చేయాల్సి ఉంటుందని, సంవత్సర ప్యాకేజీ రూ.1.69 లక్షల నుంచి రూ.1.90 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

ఉక్కు కార్మికులపై రోజుకో గుదిబండ

- పోరాట కమిటీ నాయకుల ఆగ్రహం
- 1197వ రోజుకు రిలే దీక్షలు


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అగనంపూడి: ఉక్కు కార్మికులపై యాజమాన్యం రోజుకో గుదిబండ మోపుతోందని విశాఖ ఉక్కు కార్మిక సంఘం నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలోని ముఖద్వారం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు గురువారానికి 1197వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ఓపక్క కర్మాగారాన్ని హోల్‌సేల్‌గా అమ్మేయడానికి కుతంత్రాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న ఉక్కు ఉన్నతాధికారులు, కార్మికులు నివాసముంటున్న క్వార్టర్స్ విద్యుత్ చార్జీలను రెట్టింపు చేయడం అన్యాయమన్నారు. పెంచిన చార్జీలు వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్మికులను రోజుకో విధంగా ఇబ్బంది పాల్జేయాలని చూస్తున్నారని, ఓపక్క జీతాలు చెల్లించకుండా మరోపక్క అదనపు భారం మోపడానికి యాజమాన్యం ప్రయత్నించడం దారుణమన్నారు. పోరాట కమిటీ నాయకులు డీసీహెచ్.వెంకటేశ్వరరావు, సుబ్బయ్య, డొక్కా నరసింహారావు మాట్లాడుతూ 2017 నుంచి వేతనాల సవరణ చేయకుండా కార్మికులను ఆర్థికంగా దెబ్బతీస్తున్న యాజమాన్యం, కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ అధికారులు రోజుకో డ్రామాకు తెరలేపుతున్నారని ఆరోపించారు. ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాస్, శ్రీనివాసనాయుడు, కె.వెంకటరావు, రమణమూర్తి, మహిళా నేత ఆదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈఈ దృష్టికి నీటి సరఫరా సమస్యలు


ఈఈకి సమస్యలు వివరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు వుడానగర్ ఫేజ్–1 కాలనీలోని మంచినీటి సరఫరాకు సంబంధించిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని జీవీఎంసీ నీటిసరఫరా ఈఈ కనకారావును అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. వార్డులోని వుడానగర్ ఇతర ప్రాంతాల్లో ఆయన పర్యటించి, నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వుడానగర్ అసోసియేషన్ ప్రతినిధులు కె.ఈశ్వర్, పీఆర్ ఖాన్ మాట్లాడుతూ పైప్‌లైన్ లీకేజీ సమస్యలను వివరించారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఈఈ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కేదార్‌నాథ్, సునిల్, మహేష్ పాల్గొన్నారు.

వైన్ షాపులో అగ్నిప్రమాదం

రూ.2 లక్షల ఆస్తినష్టం


వైన్ షాపులో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పంతులు గారి మేడ వద్ద గల వైన్ షాపులో అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి, మంటలను అదుపు చేయడంతో భారీ నష్టం తప్పింది. పెదగంట్యాడ అగ్నిమాపక అధికారి ఎస్.గోపీకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వైన్ షాపులో గురువారం ఉదయం పొగ రావడం గుర్తించిన స్థానికులు షాపు సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి, షాపు తలుపులు తెరిచి, లోపల మంటలు వ్యాపించడాన్ని గమనించి, వెంటనే పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి ఉంటుందని అగ్నిమాపక కేంద్ర అధికారి ఎస్.గోపీకృష్ణ తెలిపారు. ప్రమాదంలో కంప్యూటర్లు, ఇతర పరికరాలు కాలిపోవడంతో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. మరో రూ.23 లక్షల వరకు ఆస్తిని సురక్షితంగా కాపాడగలిగామన్నారు.

తిరుమలేశునికి పల్లకీ సేవ


తిరుమల బాలాజీకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలేశునికి పల్లకీ ఉత్సవాన్ని గురువారం కనులపండువగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి విశేష పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి పల్లకీ సేవ జరిపించారు. తిరుమలేశునికి నక్షత్ర హారతి ఇచ్చారు. భక్తులకు స్వామి నిజరూప దర్శనం కలగజేశారు. దివ్యక్షేత్రం ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

అప్పన్నకు రెండో విడత చందనం సమర్పణ

- విశేషంగా స్వామికి పంచకలశ స్నపనం
- చందనంతో దర్శనమిచ్చిన అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి


స్వామికి పంచకలశ స్నపనం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం రెండవ విడత చందన సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారు జాము రెండు గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం మూడు మణుగుల చందనాన్ని స్వామికి సమర్పించారు. అనంతరం ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు విశేషంగా పంచకలశ స్నపనం నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. గంగా జలాలు, పంచామృతాలతో స్నపనం నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

కమనీయం.. కల్యాణోత్సవం


పాలు, పెరుగు, జలాలతో ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేస్తున్న అర్చకులు

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు గురువారంతో ముగిసాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఉదయం అష్టోత్తర శత కలశస్నపనం, తిరుమంజన సేవ, వసంతోత్సవం, చక్రతీర్థం నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి వీరరాఘవాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కలశాలలో నింపిన పాలు, పెరుగు, గంధం, పసుపు నీటితో శ్రీచక్రంతో పాటు ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అభిషేకంలు నిర్వహించారు. ముందుగా పూర్ణాహుతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారికి భక్తిశ్రద్ధలతో చక్రస్నానం చేశారు. సాయంత్రం ధ్వజావరోహణం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణంతో బల్లిగిరి మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్ర హారతి, సప్త హారతులు నిర్వహించారు.

ఘనంగా మన్యుసూక్త హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట: మెయిన్ రోడ్డులో వేంచేసిన శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల పౌర్ణమి రోజున స్వామివారికి ఈ హోమం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హోమం వల్ల నరఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహ దోష శాంతి చేకూరుతాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రూ. 516 చెల్లించి భక్తులు పాల్గొన్నారు. హోమానంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420
Office mail : sakshiadvtvsp@gmail.com